# జేఎన్టీయూ బీవోఎస్ సమావేశం నేడు

కూకట్‌పల్లి: జేఎన్టీయూ క్యాంపస్‌తో సహా మిగతా ఏడు అనుబంధ కళాశాలలకు సంబంధించి ఇంజినీరింగ్ కోర్సుల్లో సిలబస్ మార్పుపై బీవోఎస్(బోర్డ్ ఆఫ్ స్టడీస్) సమావేశం గురువారం ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో ఉదయం 10 గంటలకు వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతారు. జేఎన్టీయూ క్యాంపస్‌తో సహా వర్సిటీ అనుబంధంగా నడుస్తున్న మరో ఏడు (మంథని, మహబూబాబాద్, పాలేరు, సుల్తాన్‌పూర్, సిరిసిల్ల, జగిత్యాల, వనపర్తి) కళాశాలల సిలబస్ మార్పు, కోర్సు స్ట్రక్చర్, రెగ్యులేషన్స్(ఆర్-25)పై తుది కసరత్తులో భాగంగా సమావేశం ఏర్పాటుచేశారు. ఉస్మానియా, సెంట్రల్ యూనివర్సిటీ నిపుణులతో పాటు పారిశ్రామిక రంగం, అలుమ్ని ప్రతినిధులు పాల్గొననున్నారు.

# ఇంజినీరింగ్ తొలి విడతలో 59,980 మంది చేరిక

- బీటెక్ సీట్లు పొందినా ఆసక్తి చూపని 17,581 మంది
- మిగిలిన మొత్తం సీట్లు 23,074
- 25 నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్
- మరో 5 వేల వరకు సీట్లు పెరిగే అవకాశం




ఈనాడు, హైదరాబాద్ : ఎప్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారిలో 59,980 మంది ఇంజినీరింగ్‌లో చేరేందుకు ఆసక్తి చూపారు. కన్వీనర్ కోటాలో 83,054 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా తొలి విడతలో 77,561 మందికి సీట్లు దక్కాయి. వారిలో 59,980 మంది మాత్రమే ఫీజు చెల్లించి... ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. అంటే 17,581 మందికి (22.66 శాతం) తాము సీట్లు పొందిన కళాశాలలు లేదా బీటెక్ బ్రాంచీలు నచ్చలేదు. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈ నెల 22న ముగియగా 59,980 మంది మాత్రమే (77.34 శాతం) ముందుకొచ్చారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో కచ్చితంగా సీట్లు వస్తాయని స్పష్టమైన అంచనాకు వచ్చిన వారు కౌన్సెలింగ్‌లోనే పాల్గొనలేదు.

...మిగతా 3లో

ఇంజినీరింగ్ తొలి విడతలో 59,980 మంది చేరిక

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు జోసా కౌన్సెలింగ్ ద్వారా ఎక్కడ సీటు వస్తుందో...ఒకవేళ రాకుంటే ఎలా అని ముందుజాగ్రత్తగా ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. అలాంటి వారిలో ఇప్పుడు స్పష్టత రావడంతో చేరేందుకు ఆసక్తి చూపలేదు. ఇంకొందరు యాజమాన్య కోటాలో సీట్లు పొందేందుకు, కొందరు ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో చేరేందుకు వెళ్లి ఉంటారని, కొన్ని వేల మంది బీఎస్సీలో ప్రవేశించేందుకు మొగ్గు చూపి ఉండొచ్చని భావిస్తున్నారు.

## రేపటి నుంచి రెండో విడత ప్రారంభం...

ఈ నెల 25వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ మొదలు కానుంది. ఆ రోజు ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఈ నెల 26న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. ఈ నెల 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. వారికి 30వ తేదీ లేదా ఆలోపు సీట్లు కేటాయిస్తారు.

## పెరగనున్న బీటెక్ సీట్లు

రెండో విడతకు బీటెక్ సీట్లు పెరగనున్నాయి. తొలి విడతలో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తయిన అనంతరం 23,074 సీట్లు మిగిలాయి. కొన్ని కళాశాలలు అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిల్లో కోర్ బ్రాంచీలైన ఈసీఈ, సివిల్, మెకానికల్ కూడా ఉన్నాయి. సీఎస్ఈ సంబంధిత బ్రాంచీలతోపాటు మొత్తం కలిపి మరో 5 వేల వరకు కొత్త సీట్లు రావొచ్చని తెలుస్తోంది. ఏ ప్రాతిపదికన సీట్లు పెంచాలన్న దానిపై దాదాపు కసరత్తు పూర్తైందని సమాచారం. ఈ నెల 25వ తేదీన సీట్ల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు జారీ కానున్నాయి. సీట్లు పెరగడం వల్ల రెండో విడతలో మెరుగైన కళాశాల, బ్రాంచీకి విద్యార్థులు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ప్రధాన బ్రాంచీల్లో ఇదీ సీట్ల భర్తీ పరిస్థితి**

| కోర్సు పేరు | మొత్తం సీట్లు | కేటాయింపు | చేరింది |
|---|---|---|---|
| సీఎస్ఈ | 28,246 | 27,657 | 21,286 |
| ఐటీ | 3,960 | 3,849 | 3,171 |
| సీఎస్ఈ(ఏఐ-ఎంఎల్) | 13,540 | 13,093 | 10,733 |
| సీఎస్ఈ(డేటా సైన్స్) | 7,600 | 7,295 | 5,677 |
| సీఎస్ఈ(సైబర్ టెక్నాలజీ) | 1,560 | 1,528 | 1,203 |
| ఏఐ అండ్ డేటా సైన్స్ | 1,301 | 1,276 | 947 |
| ఈసీఈ | 10,967 | 10,099 | 7,714 |
| ఈఈఈ | 4,695 | 3,519 | 2,526 |
| సివిల్ | 3,376 | 2,756 | 1,976 |
| మెకానికల్ | 3,230 | 2,401 | 1,600 |

# ఇంజినీరింగ్‌లో మళ్లీ 17వేల సీట్లు ఖాళీ

- సీటు వచ్చినా రిపోర్ట్ చేయని విద్యార్థులు
- రెండో విడతలో భర్తీ చేసే అవకాశం
- రేపటి నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : బీటెక్ ఫస్టియర్‌లో మరో 17,581 సీట్లు ఖాళీ అయ్యాయి. ఈ సీట్లు దక్కించుకున్న వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయలేదు. దీంతో ఈ సీట్లు మళ్లీ ఖాళీ అయ్యాయి. ఎప్‌సెట్ మొదటి విడత సీట్లను ఈ నెల 18న కేటాయించారు. 22లోపు రిపోర్ట్‌చేయాలని అధికారులు సూచించారు. 77,561 సీట్లకు 59,980 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. మరో 17,581 మంది విద్యార్థులు రిపోర్ట్ చేయలేదు. సీఎస్‌ఈ తత్సమాన బ్రాంచీల్లో 57,042 సీట్లకు 44,798 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్‌లో 14,054 సీట్లకు 10,594 మంది, మెకానిక్ ఇతర బ్రాంచీల్లో 5,632 సీట్లకు 3,943 మంది చొప్పున మాత్రమే రిపోర్ట్‌చేశారు. డిమాండ్ ఉన్న సీఎస్‌ఈ తత్సమాన బ్రాంచీల్లోనూ ఏడువేల మంది సీట్లు వదులుకున్నారు. మొదటి విడతలో 5,493 సీట్లు నిండలేదు. 17,581 సీట్లు ఖాళీ అయ్యాయి. 23,074 సీట్లు భర్తీకాలేదు. ఈ మొత్తం సీట్లను శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌లో భర్తీచేయనున్నారు. రెండో విడతకు సంబంధించి 25న విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 26, 27న వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 27న ఆప్షన్లు ఫ్రీజ్ చేసుకోవచ్చు. 30న సీట్లు కేటాయిస్తారు. 30 నుంచి ఆగస్టు 1 వరకు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. 31 నుంచి ఆగస్టు 2 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 3లోగా కాలేజీల్లో చేరిన వారి వివరాలు అప్‌డేట్ చేయాలి. ఆ తర్వాత మిగిలిన సీట్లకు ఆగస్టు 5 నుంచి తుది విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.